# గులాబీ మొక్క

– భీసెట్టి శ్రీనివాసరావు

రంగు మేడ అది. చుట్టూ అందమైన కాంపౌండ్ వాల్‌తో ఆ వీధిలో కెల్లా ఆ ఇల్లు అందంగా ఉంది. ఇంటి ముందు ఖాళీగా ఉన్న కొద్ది గజాల స్థలంలో గులాబీ మొక్కలు పెంచాలని మోహన్‌రావు భార్య సరస్వతికి ఎన్నాళ్ళ నుంచో వుంది. ఎందుచేతో మోహనరావు అందుకు సహకరించడం లేదు. పొద్దున్న పోయి ఆఫీసుకు సాయంత్రం వొస్తాడు. ఇంక మొక్కలు ఎలా కొంటాడు? ఎప్పుడు పెంచుతారు?

సరస్వతి చెప్పినప్పుడల్లా "కొందాం" అని తలూపి, ఇంక ఆ విషయం అంతటితో మర్చిపోతున్నాడు. కానీ ఈసారి ఆ ఆదివారం మాత్రం అతని చేత మొక్కలు ఎలాగైనా కొనిపించాలని ధృడంగా నిశ్చయించుకొంది సరస్వతి.

ఆదివారం కావడంతో ఆఫీసు శెలవు. మోహనరావు వరండాలో కూర్చుని పేపరు చదువుకుంటుండగా కాఫీ పట్టుకొచ్చింది సరస్వతి.

కాఫీ తాగాక అంది.

"ఏవండి! ఈ రోజు ఆదివారం కదా! మీకు ఆఫీసు శెలవు. ఈ రోజు ఎలాగైన గులాబీ మొక్కలు కొని పట్రండి! పెరట్లో వేద్దాం" అంది.

మోహనరావు సరేనని తలూపాడు.

ఇంట్లోకొచ్చి గళ్ళ షర్టు వేసుకున్నాడు. ఉదయం పాలవాడికి ఎనభై రూపాయలు ఇవ్వగా మిగిలిన ఇరవై జేబులో ఉన్నాయి. దాంతో మొక్కలు కొందామని బయలుదేరాడు.

ఆరోజు ఆదివారం కావడంతో ఆ వూర్లో సంత జరుగుతుంది. సంతలో మొక్కలు అమ్ముతారు. సంతకు బయలుదేరాడు మోహనరావు. అనకాపల్లిలో ప్రతీ ఆదివారం జరిగే సంతకు చుట్టుపక్కల వూర్ల నుంచే కాకుండా అనకాపల్లి నుంచి కూడా వస్తుంటారు. అందువల్ల కిటకిటలాడుతుంటుంది ఎప్పుడూ సంత. అందులోను సంతకి దగ్గర్లో నూకాంబికా అమ్మవారి దేవాలయం ఒకటుంది. ప్రతీ ఆదివారం దానికొచ్చే భక్తులు సంతకు కూడా వొచ్చి రద్దీని పెంచుతారు.

మోహనరావు వెళ్ళేసరికి సంతలో ఇసుక వేస్తే రాలనంత జనం వున్నారు. అందులో మొక్కలమ్మే చోటుకెళ్ళాడు. అక్కడ ఒక ముసలివాడు వున్నాడు. అతని పేరు ముసలయ్య. డబ్బయి ఏళ్ళుంటాయి.

అతని దగ్గర రకరకాల మొక్కలు వున్నాయి. చూడముచ్చటగా వున్నాయి అన్నీ. అందులో తనకు నచ్చిన గులాబీ మొక్కలు కొన్ని కొన్నాడు మోహనరావు. ఆ మొక్కలకు ఇరవై రూపాయలు ఖరీదు కట్టాడు.

ఆ మొక్కలు పట్టుకొని వొస్తుండగా

"బాబూ!"

వెనక నుంచి వినిపించేసరికి తల తిప్పి



ప్రశ్నార్థకంగా చూశాడు మోహనరావు ముసలయ్య వేపు.

"డబ్బులివ్వలేదు బాబు!"

ఆశ్చర్యపోయాడు మోహనరావు.

"ఇప్పుడే కదా! ఇరవై రూపాయలు ఇచ్చాను. మళ్ళీ అడుగుతావేంటి?" కోపంగా అడిగాడు.

"లేదు బాబు! అస్సలు ఇవ్వలేదు తమరు. మీరు జేబులో చూస్కోండి" అన్నాడు దీనంగా- శాంతంగా ముసలయ్య.

"రాస్కెల్! అంటే నేను అబద్ధం ఆడుతున్నాననా? నీ ఉద్దేశ్యం. చూస్కో నువ్వే! నీ దగ్గర ఇరవై రూపాయల కాగితం ఉంటుంది" అన్నాడు కోపంగా మోహనరావు.

"లేదు బాబూ! తమరు డబ్బునివ్వలేదు. నాకు గుర్తే!" అన్నాడు ముసలయ్య.

మోహనరావు జేబులో చూస్కున్నాడు. ఇరవైరూపాయల నోటు లేదు. అంటే ముసలయ్యకి ఇవ్వడంవలన లేవు. మరి వీడు ఇవ్వలేదంటాడేంటి? అబద్ధం ఆడుతున్నాడా? తను జేబులో ఇరవై రూపాయల నోటు పెట్టుకొని మరీ సంతకు వొచ్చానే?"

చుట్టూ జనం మెల్లగా ప్రోగవుతుండటంతో మోహనరావుకి అవమానంతో తల కొట్టేసినట్టయింది. కోపంతో ముసలయ్యని కొట్టాడు మోహనరావు.

"రాస్కెల్! నేను నీకు ఇరవై రూపాయలు నోటు ఇస్తే ఇవ్వలేదని బుకాయిస్తున్నావా? మూడు వేల రూపాయలు జీతగాడ్ని.

నాకు అబద్ధం ఆడవలసిన అగత్యం ఏమొచ్చింది?" అన్నాడు.

చుట్టూ చేరిన జనం- ముసలయ్యే కావాలని అబద్ధం ఆడుతున్నట్టు భావించారు.

"సార్! వీడితో మీకేంటి సార్! మతిపోయి వీడున్నాడు. మీరెళ్ళండి మీరు డబ్బులిస్తే ఇవ్వలేదనుకొని మళ్ళీ అడుగుతున్నాడు" అన్నారు మోహనరావుని సమర్థిస్తూ.

"ముసలయ్య బిక్క చచ్చిపోయాడు.

జనం అలా మాట్లాడ్డంతో నోరు పెగల్లేదు ఏం మాట్లాడాలో తెలీక అలా ఉండిపోయాడు.

మోహనరావు వెళ్ళిపోయాడు. ముసలయ్య మౌనంగా చూస్తుండిపోయాడు. చుట్టూ చేరిన జనం పల్చబడసాగారు.

★★★★★

> **నా వడ్డాణం**
>
> "ఏవండీ, నేను చనిపోతే మళ్ళీ పెళ్ళి చేసుకుంటారా" అడిగింది యాక్సిడెంట్‌లో గాయపడిన భార్య.
>
> "చేసుకోనే, పిల్లలతోనే ఉంటాను."
>
> "ఒకవేళ చేసుకుంటే, నా వడ్డాణం మాత్రం ఆవిడకు ఇవ్వకండి."
>
> "అది ఆవిడకు పట్టదులేవే! ఆవిడ లావు. అని నాలిక్కరుచుకున్నాడు భర్త."
>
> — పి. సీతారామిరెడ్డి,
> నాగినేనిప్రోలు.

మోహనరావు ఇంటికి మొక్కలు తీసుకు రాగానే సరస్వతి పెరట్లో నాటేసింది. గులాబీ మొక్కలు అందంగా ఉన్నాయి. హైబ్రీడ్ మొక్కలు కావడంతో బాగా పువ్వులు కాస్తాయన్న నమ్మకం కుదిరింది ఇద్దరికి.

మోహనరావు సరస్వతికి సంతలో ముసలయ్యతో జరిగిన గొడవ గురించి గాని, తను కొట్టిన విషయంగాని చెప్పలేదు. వారం రోజులు కాల గర్భంలో కలిసిపోయాయి.

★★★★★

ఆరోజు ఆదివారం-

ఇంట్లో కలర్ టి.వి.లో నేషనల్ ప్రోగ్రామ్ చూస్తుండగా-

"ఏవండీ!" సరస్వతి పిలుపువిని మోహనరావు ఆమె దగ్గరకు వెళ్ళాడు.

"మీ షర్టులో ఇరవై రూపాయలు ఉన్నాయండీ!" అంది. ఇరవై నోటు తీసి చూపిస్తూ.

మోహనరావు ఉలిక్కిపడ్డాడు. జేబులో ఇరవైనోటు ఉండటం చూసి.

ఇదెలా వచ్చింది? ఏ షర్టులో వుంది? తను ఆ రోజు సంతకు ఏ షర్టు వేసుకు వెళ్ళాడు?

"బట్టలుతుకుదామని మీ బట్టలు తీస్తుండగా క్రీం కలర్ షర్టులో ఉంది ఈ ఇరవై నోటు" అని చెప్పడంతో మోహనరావు హతాశుడయ్యాడు.

అంటే- తను ఆరోజు వేసుకెళ్ళింది గళ్ళ షర్టు అన్నమాట! అందులో ఇరవై రూపాయలు ఉందనుకున్నాడు. పొరపాటున దాన్ని వేసుకొని వెళ్ళాడు. క్రీం కలర్ షర్టులో ఇరవై నోటు ఉందన్న సంగతి మర్చిపోయి దాన్ని తొడుక్కు వెళ్ళాడు. ఆలోచిస్తున్న మోహనరావుకి మతి పోతున్నట్లయింది.

"ఆరోజు ముసలయ్య" డబ్బులు ఇవ్వలేదనడం, తను ఇచ్చానని అనడం, ఆఖరికి కోపంతో కొట్టడం, "మైగాడ్!" బాధగా ఫీలవుతూ- పశ్చాత్తాపం పడసాగాడు తనలో తనే! అంతే విసురుగా లేచి ఆ షర్టు వేసుకొని తన కందిన జీతంలోంచి వంద రూపాయల కాగితం పట్టుకొని సంతకు బయలుదేరాడు.

అతను సంతకు వెళ్ళేసరికి ఎప్పటిలా మొక్కలమ్మేవాడు కనిపించాడు అతనికి. కానీ అందులో ముసలయ్య లేడు. అతని మనసు కీడు శంకించింది.

ఏదో లోపం కనిపిస్తోంది. ఏదో జరిగింది. ముసలయ్య కనిపించక పోవడంతో తన గుండెను ఎవరో పిండినట్లయింది. బాధతో విలవిలలాడిపోయాడొక క్షణం.

"ఇక్కడ ముసలయ్య అనే అతను ఉండాలే? అతను ఏడి?" రెండో వ్యక్తిని అడిగాడు. అతను ఎగాదిగా మోహనరావు వేపు చూసాడు.

"లేడండి!"

"లేడా? ఎక్కడికెళ్ళాడు?" ఆతృతంగా అడిగాడు.

"చచ్చిపోయాడండి" ఆ కుర్రాడు చెప్పాడు.

అదిరిపోయాడు ఆ సమాధానం విని మోహనరావు. బాధతో విలవిలలాడి పోయాడొక క్షణం.

"మరి నువ్వు?" సందిగ్ధంగా అడిగాడు.

"నేను ముసలయ్య కొడుకునండి. మీకు మొక్కలు కావాలా?" అనడిగాడు. సమాధానంగా మోహనరావు-

"ఈ వందరూపాయలు వుంచు" అని వంద నోటు అందించి అక్కడ్నుంచి వచ్చేశాడు. అతని మనసు మనసులో లేదు. బాధతో గింజుకోసాగింది. గుండెను ఎవరో పిండుతున్నట్లయింది.

ఇంటికి రాగానే-

పెరట్లో గులాబీ మొక్క కనిపించింది.

అప్పుడే చిగురిస్తూ- పచ్చగా! ముసలయ్య ప్రతిరూపం ఆ గులాబీ మొక్కలో ఉందేమో అనిపించేట్టుగా ఉంది ఆ గులాబీ మొక్క!

చిగురిస్తున్న గులాబీ మొక్కని చూస్తూ తలదించుకున్నాడు మోహనరావు పశ్చాత్తాపంతో అతని కళ్ళు అశ్రునయనాలతో వర్షిస్తున్నాయి.

●